గురుకులాలాలకు సొంత భవనాలు

- ఉపాధ్యాయులకు బదిలీలు, ఉద్యోగోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలి
- అన్ని సొసైటీల్లో ఏకరూప పరిపాలన అమలు చేయాలి
- విద్యార్థుల మెస్ చార్జీల పెంపు ఉత్తర్వులివ్వాలి
- టిఎస్‌యుటిఎఫ్ గురుకుల టీచర్ల రాష్ట్ర సదస్సు డిమాండ్
- దశలవారీ ఉద్యమానికి శ్రీకారం
- ఆగస్టు ఐదున హైదరాబాద్‌లో మహాధర్నా
- సమస్యల పరిష్కారానికి ఐక్యఉద్యమాలే మార్గం : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని అన్ని గురుకుల పాఠశాలలకూ స్వంత భవనాలు నిర్మించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్‌యుటిఎఫ్) రాష్ట్ర సదస్సు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. వాటిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీలు, ఉద్యోగోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని, కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరింది. అన్ని సొసైటీల్లోనూ ఏకరూప పరిపాలన అమలు చేయాలని సూచించింది. విద్యార్థుల మెస్ చార్జీల పెంపు ఉత్తర్వులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. ఉపాధ్యాయులకు శ్రమకు తగిన వేతనాలు (పారిటీ స్కేల్స్) అమలు చేయాలని కోరింది. గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం దశలవారీ పోరాట కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించింది. ఆగస్టు ఐదో తేదీన హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహించనున్నట్టు ప్రకటించింది. టిఎస్‌యుటిఎఫ్ ఆధ్వర్యంలో సంక్షేమ గురుకుల పాఠశాల ఉపాధ్యాయుల రాష్ట్ర సదస్సును బుధవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో గురుకుల విద్యాసంస్థలు నాణ్యమైన విద్యకు విజయవంతమైన నమూనాగా ఉన్నాయని చెప్పారు. గురుకుల విద్యార్థులు సాధించిన విజయాల వెనుక ఉపాధ్యాయుల శ్రమ, అంకితభావం అంతర్లీనంగా ఉందన్నారు. వారి శ్రమను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరముందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వందల సంఖ్యలో ఏర్పాటు చేసిన గురుకులాలకు వెంటనే శాశ్వత భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల మెస్ చార్జీలు 25 శాతం పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో పాఠశాలల ప్రారంభం నాటికే ఉత్తర్వులివ్వాలని కోరారు. సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలే మార్గమని చెప్పారు. టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి మాట్లాడుతూ గురుకుల ఉపాధ్యాయులు పాఠ్యబోధనతోపాటు హౌజ్ మాస్టర్, కేర్‌టేకర్, డిప్యూటీ వార్డెన్, సూపర్‌వైజరీ స్టడీస్, నైట్ స్టే, ఎస్కార్ట్ తదితర ఎన్నో విధులను నిర్వహిస్తున్నారని అన్నారు. 24x7 పనిచేస్తూ విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుతున్నారని చెప్పారు. అయినా ఉపాధ్యాయుల శ్రమకు తగిన వేతనం గానీ, కష్టానికి తగిన గుర్తింపుగానీ లభించడం లేదన్నారు. నిర్వహణలో ఏమాత్రం తేడావచ్చినా కఠిన శిక్షలు విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు శారీరక శ్రమతో పాటు తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని అన్నారు. వారిపై బోధనేతర పనుల భారం తగ్గించాలని, స్వేచ్ఛగా పనిచేసే వాతావరణం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒక్కో సొసైటీలో ఒక్కో రకంగా పరిపాలన, ఆజమాయిషీ కొనసాగుతోందని చెప్పారు. బోధనా సమయాల్లో సైతం ఏకరూపత లేదన్నారు. రెగ్యులర్ ఉపాధ్యాయులతోపాటు సమాన సంఖ్యలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, గెస్ట్, పార్ట్ టైం టీచర్లు పనిచేస్తున్నారని వివరించారు. వారికి కనీస వేతనాలు లభించటం లేదన్నారు. ఈ క్రమంలో గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం దశలవారీ పోరాటానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌యుటిఎఫ్ కోశాధికారి టి లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సింహాచలం, గురుకుల ఉపాధ్యాయుల ప్రతినిధులు సృజన, ఎల్లయ్య, రాంబాబు, మహేష్, లివిన్ స్టన్, రామకృష్ణ, దామోదర్, శ్రీనివాస్, ఆంజనేయులు, అబిద్ పాషా, నరసింహ, అరుణా దేవి, రాజశ్రీ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

దశలవారీ కార్యాచరణ

- జూన్ 13 నుంచి 17 వరకు అన్ని సొసైటీల కార్యదర్శులకు, మంత్రులకు చార్టర్ ఆఫ్ డిమాండ్లతో కూడిన నోటీసులను సమర్పించాలి.
- జూన్ 26/27 తేదీల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలి. భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించాలి.
- జులై 17న జిల్లా కేంద్రాల్లో నిరసన దీక్షలు
- ఆగస్టు 5న హైదరాబాద్ లో మహాధర్నా

భూమి పూజ చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

'సంగమేశ్వర' పూర్తయితే బీడు భూములుండవ్..

- వైద్యారోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు
- ఎత్తిపోతల నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగమేశ్వర్ ఎత్తిపోతల ప్రాజెక్టు పూర్తయితే సంగారెడ్డి, జహీరాబాద్, అందోల్, నారాయణఖేడ్ ప్రాంతాల్లో బీడు భూములుండవని.. అంతా సాగులోకి వస్తుందని వైద్యారోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సాగునీటి దినోత్సవం సందర్భంగా బుధవారం సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం చిన్నచెల్మడ గ్రామంలో సంగమేశ్వర ఎత్తిపోతల పథకం నిర్మాణానికి మంత్రి భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాడు ఈ ప్రాంతంలో కనీసం తాగునీరు లేని దుస్థితి ఉండేదని, నేడు ఇదే ప్రాంతంలో సాగునీటికి ప్రాజెక్టులు కడుతున్నామని చెప్పారు. సంగమేశ్వర పథకం ఏడాదిలో నిర్మాణం పూర్తి అవుతుందని, దాంతో అంతా సస్యశ్యామలంగా మారుతుందని అన్నారు. సిఎం కెసిఆర్ ప్రత్యేక చొరవతో సింగూరు, గోదావరి నీళ్లను తీసుకొచ్చారన్నారు. ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడానికి రూ.2653 కోట్లతో సంగమేశ్వర ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసుకున్నామన్నారు. ఇది పూర్తయితే రెండు లక్షల 19 వేల ఎకరాల సాగు జరుగుతుందన్నారు. ఇంతకాలం ఇక్కడ వర్షాధారంపైన ఆధారపడి పత్తి, మక్కజొన్న పంటలు వేసేవారని.. వర్షం సరిగా లేకుంటే అవి కూడా ఎండిపోయేవన్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తి అయితే ఏడాదికి రెండు పంటలు పండుతాయని చెప్పారు. సింగూర్ నీళ్ల మెదక్, నిజామాబాద్ జిల్లాల బిడ్డలకు దక్కాలనే ఉద్దేశంతో సిఎం ఈ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు చేపట్టారని తెలిపారు. ఈ ప్రాజెక్టు ఏడాదిలో పూర్తవుతుందని.. బీడు భూములు ఉండవని చెప్పారు. సంగమేశ్వర, బసవేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల ద్వారా నాలుగు లక్షల ఎకరాలకు సాగు నీరందించి.. కరువు ప్రాంతాన్ని మెతుకు ప్రాంతంగా మారుస్తామన్నారు. ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ స్థానికుడని, చురుకుగా పని చేసే వ్యక్తి అని అన్నారు. ఇక్కడే ఉంటూ ప్రజల మధ్యలో ఉండి సాధారణ జీవితాన్ని గడుపుతున్న క్రాంతిని మరోమారు గెలిపించాలని ప్రజలను కోరారు.

నేడు పిజిఇసెట్ ఫలితాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఎంఇ, ఎంటెక్, ఎంఫార్మసీ, ఎంఆర్క్ కోర్సుల్లో 2023-24 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన పీజీఈసెట్ రాతపరీక్షల ఫలితాలు గురువారం విడుదల కానున్నాయి. ఈ మేరకు పీజీఈసెట్ కన్వీనర్ బి రవీంద్రారెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్‌లోని జెఎన్‌టియు హైదరాబాద్‌లో గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి ఈ ఫలితాలను విడుదల చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియు హైదరాబాద్ విసి కట్టా నర్సింహారెడ్డి, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్ వి వెంకటరమణ, కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, పాల్గొంటారని పేర్కొన్నారు.

కంప్యూటర్ ఆధారిత రాతపరీక్ష (సిబిఆర్‌డి) విధానంలో గతనెల 29 నుంచి ఈ నెల ఒకటో తేదీ వరకు పీజీఈసెట్ రాతపరీక్షలను నిర్వహించిన విషయం తెలిసిందే. పీజీఈసెట్‌కు 16,563 మంది దరఖాస్తు చేస్తే 14,882 (89.85 శాతం) మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు.

నిమ్స్ డైరెక్టర్‌గా బీరప్ప

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిమ్స్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్, డాక్టర్ బీరప్ప నగరి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం వైద్యారోగ్యశాఖ కార్యదర్శి ఎస్ఎఎం రిజ్వీ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం అధిపతిగా కొనసాగుతున్నారు.

వర్సిటీల్లోని నాన్‌టీచింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలి

- మంత్రి సబితా ఇంద్రారెడ్డికి సిఐటియు వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యూనివర్సిటీల్లోని టైమ్ స్కేల్, డైలీవేజ్, ఎన్ఎంఆర్, కంటింజెంట్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ తదితర నాన్ టీచింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని తెలంగాణ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డికి ఆ యూనియన్ గౌరవాధ్యక్షులు జె వెంకటేశ్, సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మెట్టు రవి, వి నారాయణ, ఉపాధ్యక్షులు మహేందర్, తదితరులు కలిసి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రాష్ట్రంలోని 18 వర్సిటీల్లో సుమారు 10 వేల మంది సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు. విశ్వవిద్యాలయాల కార్యకలాపాల్లో నాన్‌టీచింగ్ సిబ్బంది పాత్ర చాలా కీలకమని రాష్ట్ర ప్రభుత్వమే పలుమార్లు చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. వారికి ఇచ్చే వేతనాల్లో చాలా వ్యత్యాసాలున్నాయని, మూడేళ్లుగా ఏజెన్సీల ద్వారానే నియామకాలు జరుగుతున్నాయని చెప్పారు. యూనివర్సిటీలు నిర్ణయించిన కనీస వేతనాలే అతి తక్కువని, అందులోనూ ప్రభుత్వమిచ్చే దాంట్లో ఏజెన్సీలు పర్సెంటేజీలు తీసుకుంటుండటంతో చాలా తక్కువ అందుతుందని వివరించారు. ఉస్మానియా యూనివర్సిటీలో టైం స్కేల్ గ్రూప్-డి ఉద్యోగికి రూ.31వేలు, శాతవాహనలో రూ.26 వేలు ఇస్తున్నారని తెలిపారు. డైలీవేజ్‌లో అటెండర్, స్వీపర్ కేటగిరీలో ఉన్నవారికి, గ్రూపు వర్కర్లకు రూ.16 వేలు, గార్డెనింగ్ వర్కర్‌కు రూ.13 వేలు, హాస్టల్స్‌లో కుక్‌కు రూ.పది వేలు, హెల్పర్‌కు రూ. ఎనిమిది వేలు చెల్లిస్తున్నారని వివరించారు. వేతనాల్లో ఈ వ్యత్యాలుండటం సరిగాదన్నారు. నాన్‌టీచింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని కోరారు.

అక్కడ ఇవ్వలేదు కానీ.. ఇక్కడ డైలాగులు కొడుతున్నరు

- ఓట్ల కోసమే బిజెపి, కాంగ్రెసోళ్లు వస్తుండ్రు
- ఐటి, పురపాలక, పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్, పార్టీకి ఛత్తీస్‌గఢ్‌లో ఇంటింటికీ నల్లా నీరిచ్చే మొఖం లేదు కానీ.. తెలంగాణలో మాత్రం పెద్దపెద్ద డైలాగులు కొడుతున్నారని, ఎలక్షన్లు రాగానే కాంగ్రెస్, బిజెపోళ్లు వివిధ హామీలతో వస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐటి, పురపాలక, పరిశ్రమలశాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం ములుగు జిల్లా కేంద్రంలో నిర్వహించిన సాగునీటి దినోత్సవ వేడుకల్లో కెటిఆర్ పాల్గొన్నారు. అంతకు ముందు రూ.133 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, రూ.120 కోట్ల విలువైన సబ్సిడీ పథకాలు, ఆస్తులు పంపిణీ చేశారు. రూ.65 కోట్లతో నిర్మించే సమీకృత కలెక్టరేట్ భవనానికి, రూ.38 కోట్ల 50లక్షలతో నిర్మించే జిల్లా పోలీస్ కార్యాలయానికి, రూ.10 కోట్ల 40 లక్షలతో నిర్మించే ప్రభుత్వ కార్యాలయ భవనాలకు, రూ. కోటీ 25లక్షలతో నిర్మించే బస్ స్టాండ్‌కు, రూ.50 లక్షలతో సేవాలాల్ భవన నిర్మాణానికి, రూ.30 లక్షలతో డిజిటల్ లైబ్రరీ భవనానికి, రూ.కోటితో శ్మశానవాటిక నిర్మాణానికి, రూ.15 లక్షలతో సమాచార పౌర సంబంధాల శాఖ సమావేశ మందిర నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.12కోట్ల 50లక్షలతో జిల్లాలో నిర్మించిన ఐదు మార్డెన్ పోలీస్ స్టేషన్లను, రూ.రెండు కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు.

సాగునీటి దినోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న కెటిఆర్

ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ.. ప్రొఫెసర్ జయశంకర్‌లాంటి మేధావుల సహకారం, సారథ్యంలో తెలంగాణ ప్రజలను చైతన్యవంతం చేసి ఎత్తిన జెండా దించకుండా పోరాటం చేసి నాడు దాశరథి అన్న 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' మాత్రమే కాదు.. కోటిన్నర ఎకరాల మాగాణి అని రుజువు చేసిన మహానాయకుడు కెసిఆర్ అని అన్నారు. ముఖ్యమంత్రి సారథ్యంలో ఇవాళ సాగునీటి దినోత్సవ సంబురాలు జరుపుకుంటున్నామని, ఇక్కడికి హెలికాప్టర్‌లో హోం మంత్రి మహమ్మద్ అలీ, డిజిపి అంజని కుమార్, రాష్ట్ర రైతుబంధు అధ్యక్షులు, ఎమ్మెల్సీ పల్లె రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డిలతో వచ్చిన సమయంలో అంతా చూసుకుంటూ వచ్చామని తెలిపారు. ఎక్కడ చూసినా చెరువులు నిండుకుండల్లా కనిపిస్తున్నయన్నారు. ఒకప్పుడు ఎండకాలం వచ్చిందంటే సర్పంచులు, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు ఊళ్లకు వెళ్లాలంటే భయపడేవారన్నారు. నాడు కాంగ్రెస్ పాలనలో, సమైక్య రాష్ట్ర పాలనలో ఎంతో గోస ఉండేదో అందరూ గుర్తు చేసుకోవాలన్నారు. నేడు ఆ గోస రాష్ట్రంలో లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో తాగునీటి కటకట ఉండేదన్నారు. ప్రజా పక్షపాతి సిఎం ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మంత్రులు మహమూద్ అలీ, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, మహబూబాబాద్ ఎంపి మాలోత్ కవిత, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర జల వనరుల అభివృద్ధి సంస్థ చైర్మెన్ ప్రకాష్, మాజీ ఎంపి సీతారాం నాయక్, జిల్లా కలెక్టర్ కృష్ణ ఆదిత్య, అదనపు కలెక్టర్ ఇలా త్రిపాఠి, జెడ్‌పి చైర్మెన్ కుసుమ జగదీష్, వైస్ చైర్మెన్ బడే నాగజ్యోతి, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, సర్పంచులు పాల్గొన్నారు.

బిఆర్‌ఎస్‌లో చేరిన సామాజికవేత్త ఆనంద్ రాయ్

- మధ్యప్రదేశ్, మహారాష్ట్ర నుంచి కొనసాగుతున్న చేరికలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ పార్టీలోకి మధ్యప్రదేశ్ నుండి చేరికలు కొనసాగుతున్నాయి. ఈ దిశగా నేడు కీలక పరిణామం చోటు చేసుకున్నది. మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త, మధ్యప్రదేశ్ లో సంచలనం రేపిన వ్యాపమ్ స్కామ్‌ను వెలుగులోకి తెచ్చిన ఆనంద్ రాయ్ బుధవారం ప్రగతిభవన్‌లో బిఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీ అధినేత కెసిఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆంనద్ రాయ్ ఆర్‌టిఐ, ట్రైబల్ రైట్స్ యాక్టివిస్టుగా ప్రజల ఆదరాభిమానాలు పొందారు. మధ్యప్రదేశ్ లో గిరిజనుల హక్కుల కోసం పోరాడుతున్న 'జై ఆదివాసి యువశక్తి సంఘటన్' అనే ప్రముఖ గిరిజన హక్కుల వేదిక బిఆర్ఎస్ పార్టీకి మద్దతు ప్రకటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇది మధ్యప్రదేశ్ లో ఆదివాసి, గిరిజనుల హక్కుల కోసం పోరాడుతున్న ప్రముఖ సంస్థ. ఆనంద్ రాయ్ ఈ సంస్థలో కీలక నేతగా వ్యవహరిస్తున్నారు. వీరితో పాటు ప్రస్తుత అధ్యక్షుడు లాల్ సింగ్ బర్మన్, పంచం భీల్, అశ్విన్ దూబె, గాజీరామ్ బడోలే, కైలాశ్ రాణా తదితరులు బిఆర్ఎస్ పార్టీలో చేరారు.

బిఆర్ఎస్‌కు జెఎవైఎస్ సంపూర్ణ మద్దతు

తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు గారి పాలనలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల అభివృద్దే ధ్యేయంగా కొనసాగుతున్నాయని జెఎవైఎస్ ఫౌండర్ విక్రమ్ అచ్చాలియా తెలిపారు. దేశంలో గుణాత్మక మార్పు తీసుకురావడానికి కృషి చేస్తున్న బిఆర్ఎస్ అధినేత సిఎం కెసిఆం కు తమ జై ఆదివాసి యువశక్తి సంఘటన్ (జెఎవైఎస్) సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నదని తెలిపారు. 75 ఏళ్ళ స్వతంత్ర భారతదేశంలో పేదలు, వెనుకబడిన వర్గాలు, దళితులు, ఆదివాసీల ఆకాంక్షలు నెరవేరలేదని, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ దేశ ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తున్నారనే విశ్వాసం దేశవ్యాప్తంగా కలుగుతున్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో దేశ ప్రత్యామ్నాయ రాజకీయ వేదికగా బిఆర్ఎస్ ఎదుగుతున్నదని అన్నారు. బిఆర్ఎస్ పార్టీకి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా జాయ్స్ జాతీయ అధ్యక్షుడు లోకేష్ ముజాల్దా, వుమన్ ఇంచార్జ్ సీమా వాస్కాలె, మధ్యప్రదేశ్ అధ్యక్షుడు రాందేవ్ కకోడియా ఉన్నారు.

కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జి నాగయ్య

భూ పోరాటాలను ఉధృతం చేయండి : జి నాగయ్య

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం, సాగుభూమి, పోడు భూముల హక్కు పట్టాల కోసం భూ పోరాటాలను ఉధృతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎంబి భవన్‌లో వ్యకాస రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ.. గుడిసెలు వేసుకున్న పేదలందరికీ ఇంటి జాగా పట్టా ఇచ్చి ఇంటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.పది లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం ఐదున్నర లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోడు సాగుదారులందరికీ హక్కు పట్టాలివ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వాలు అనేక మందికి ఇళ్ల పట్టాలిచ్చారని, వారికి భూమిని చూపించకపోవడం వల్ల పట్టాలు పేదవాళ్ల చేతుల్లో ఉన్నాయని, నివాస భూమి లేక కిరాయి ఇళ్లలో బతకలేక అల్లాడుతున్నారని చెప్పారు. పాత ఇంటి జాగా పట్టా ఉన్న వాళ్లకు ప్రభుత్వమే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు నారిఐలయ్య, బి ప్రసాద్, మచ్చ వెంకటేశ్వర్లు, పొన్నం వెంకటేశ్వర్లు, రాష్ట్ర సహాయ కార్యదర్శి బి పద్మ, కె జగన్, ఆర్ శశిధర్, నరసింహులు, వెంకటయ్య, గోపాల్, ఎం ఆంజనేయులు పాల్గొన్నారు.

15 నాటికి తెలంగాణకు రుతుపవనాలు

- వారం పాటు ఎండలు, వడగాల్పులే !
- అక్కడక్కడా వర్షాలు పడే అవకాశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నైరుతి రుతుపవనాలు గురు, శుక్రవారాల్లో కేరళ రాష్ట్రాన్ని తాకే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ నెల 15 వరకు అవి తెలంగాణకు తాకే అవకాశముందని తెలిపింది. ఉత్తర ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ మీదుగా ఇంటీరియల్ కర్ణాటక వరకు సముద్ర మట్టం నుంచి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతుంది. రాష్ట్రంలో భిన్న వాతావరణ పరిస్థితి అట్లాగే కొనసాగుతుంది. ఓ వైపు ఎండలు మండిపోతున్నాయి.

వడగాల్పులు వీస్తున్నాయి. మరోవైపు కొన్న ప్రాంతాల్లో వర్షం పడుతున్నది. రాష్ట్రంలో వచ్చే నాలుగైదు రోజులు ఉష్ణోగ్రతలు చాలా ప్రాంతాల్లో 45 డిగ్రీలకుపైనే నమోదయ్యే అవకాశముంది. అదే సమయంలో ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, కొమ్రంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. బుధవారం రాత్రి పది గంటల వరకు రాష్ట్రంలో 130కిపైగా ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం మొగలగిద్దెలో అత్యధికంగా 6.9 సెంటీమీటర్ల భారీ వర్షం పడింది. 25 ప్రాంతాల్లో మోస్తరు వాన పడింది.

తంగుల(కరీంనగర్)	**45.8 డిగ్రీలు**
మేడారం(ములుగు)	**45.5 డిగ్రీలు**
దామరచర్ల(నల్లగొండ)	**45.3 డిగ్రీలు**
మునగాల(సూర్యాపేట)	**45.1 డిగ్రీలు**
మహదేవపూర్(జయశంకర్)	**45.1 డిగ్రీలు**

గిరిజన యువకులకు ఉపాధి కల్పించాలి

- ఎం ధర్మానాయక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గిరిజన యువకుల ఉపాధి కోసం ప్రత్యేక పథకం రూపొందించాలని తెలంగాణ గిరిజన సంఘం(టీజీఎస్) రాష్ట్ర అధ్యక్షులు ఎం ధర్మానాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ట్రైకార్ జీఎం శంకర్రావుకు వినతి పత్రాన్ని అందించారు. రాష్ట్రంలో ఉన్నటువంటి అనేక గిరిజన ప్రాంతాల నుంచి నగరానికి ఎక్కువ సంఖ్యలో వలస వస్తున్నారని తెలిపారు. కారు, ఆటో, అడ్డమీది కూలీలుగా పనిచేసుకుంటూ పొట్ట పోసుకుంటున్నారని పేర్కొన్నారు. గిరిజన విద్యార్థులు ఉన్నత చదువులు చదివినా.. ఉపాధి అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని ప్రభుత్వం ప్రత్యేకంగా గుర్తించి ఆయా సంస్థలలో ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా తగు చర్యలు తీసుకోవాలనీ, ఉపాధి పొందే విధంగా రుణాలు ఇవ్వాలని కోరారు. వారికోసం ప్రత్యేక పథకం ఏర్పాటుచేసి ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. శంకర్రావు స్పందిస్తూ యువకులను కచ్చితంగా సహకరించే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎ కృష్ణ, ఎస్ కిషన్, భరత్ పాల్గొన్నారు.

బిసి కులవృత్తుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- 9న సిఎం ద్వారా లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ
- మంత్రులు గంగుల, హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసి కుల వృత్తుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పనిచేస్తోందని బిసి సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. మంత్రి హరీశ్‌రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర దశాబ్ది అవతరణ ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 9న నిర్వహించనున్న సంక్షేమ దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. కులవృత్తులలో ఉన్నవారికి ఆర్థిక సహాయం అందించి వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం బ్యాంకు లింకేజీ లేకుండా లక్ష రూపాయల గ్రాంటును అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. కెసిఆర్ చేతుల మీదుగా మంచిర్యాలలో లబ్ధిదారులకు చెక్కులను అందిస్తారని తెలిపారు. మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ నిరుపేద చేతివృత్తిదారులను గుర్తించి వారికి ఆర్థిక చేయూతనిచ్చేలా కలెక్టర్లు అత్యంత శ్రద్ధ వహించాలని కోరారు. జిల్లా ఇంచార్జి మంత్రి ఆమోదంతో లబ్ధిదారులను గుర్తించాలన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో స్థానిక ప్రజాప్రతినిధులు కూడా భాగస్వాములు కావాలని కోరారు. ఈ కాన్ఫరెన్స్‌లో పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధర్ సిన్హా, బిసి సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి బి వెంకటేశం, ఎస్‌సి డెవలప్‌మెంట్ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఆర్థికశాఖ కార్యదర్శి టికె శ్రీదేవి, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్‌చొంగ్తు, ఆరోగ్య శాఖ కార్యదర్శి రిజ్వీ, అన్ని జిల్లాల కలెక్టర్లు, బిసి సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కాళేశ్వరం జలానికి లక్ష జనహారతి

- వండర్ వరల్డ్ ఆఫ్ బుక్ రికార్డ్‌లో చోటు
- మంత్రి జగదీశ్‌రెడ్డికి మెడల్, ప్రశంసాపత్రం అందజేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సూర్యాపేట జిల్లాలో బుధవారం కాళేశ్వరం జలానికి-లక్ష జనహారతి ప్రోగ్రాంకు వండర్ వరల్డ్ ఆఫ్ బుక్ రికార్డ్‌లో చోటు దక్కింది. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కాళేశ్వరం జలానికి లక్ష జన హారతి కార్యక్రమం ప్రకటించగానే వండర్ వరల్డ్ ఆఫ్ బుక్ సంస్థ ప్రతినిధులు అధ్యయనం నిర్వాహకులు ఐడబ్ల్యూ ఎస్ఆర్ ఇండియా చీఫ్ డాక్టర్ బి నరేందర్‌గౌడ్, తెలంగాణ కో-ఆర్డినేటర్ ఎ గంగాధర్ మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం మధ్యాహ్నం 12 గంటల వరకు ఏడు మండలాల్లో పర్యటించారు. కార్యక్రమంలో లక్షా 16 వేల 142 మంది పాల్గొన్నట్టు బృందం నిర్ధారించింది. అందులో 65 వేల 42 మంది మహిళలు ఉండగా, 51,100 మంది పురుషులు పాల్గొన్నట్టు వెల్లడించారు. చివ్వేంల మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన కాళేశ్వరం జలానికి- లక్ష జన హారతి కార్యక్రమం పూర్తయ్యాక నిర్వాహకులు నరేందర్ గౌడ్, గంగాధర్ వేదిక మీద మంత్రి జగదీశ్ రెడ్డికి ఘనంగా పురస్కారం మెడల్‌తో పాటూ మెమెంటో ప్రశంసాపత్రం అందజేశారు. కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్‌తో పాటు కార్యక్రమాన్ని ఆసాంతం పర్యవేక్షించిన కలెక్టర్ వెంకట్రావు, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు హేమంత్ కేశవ్ పాటిల్, జిల్లా ఎస్‌పి రాజేంద్రప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు.

చదువు మరింత భారం..!

- ఈ ఏడాది 20 శాతం పెరిగిన నోట్‌పుస్తకాల ధరలు
- సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు షాక్
- వచ్చే విద్యా సంవత్సరంలో ఫీజు చెల్లింపులూ పెనుభారమే
- ప్రభుత్వ విద్యార్థులకు లభించనున్న ఊరట
- పాఠ్యపుస్తకాలతోపాటు నోట్‌బుక్స్ అందజేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చదువు ఏటేటా భారమవుతోంది.. ఏయేటికాయేడు పెరుగుతున్న ఫీజులు, పాఠ్యపుస్తకాల, నోట్‌బుక్స్ ధరలతో విద్యార్థుల తల్లిదండ్రులు పరేషాన్ అవుతున్నారు. ఈ ఏడాది నోట్‌బుక్స్ ధరలు దాదాపు 20 శాతం పెరిగాయి. కరోనాకు ముందుతో పోల్చి చూస్తే ప్రస్తుతం మార్కెట్‌లో ధరలు విపరీతంగా పెరిగాయి. ముఖ్యంగా నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిల్ వంటి స్టేషనరీ ధరలు పెరగడంతో వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్, ధరలు పెరిగి ఇబ్బందులు పెడుతున్న వేళ.. స్కూల్ స్టేషనరీ రేట్లు పెరగడం తల్లిదండ్రులకు మరింత భారంగా మారింది. మరోవైపు ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థుల తల్లింద్రులపై ఆర్థిక భారం తగ్గనుంది. సర్కారు ఉచితంగా నోట్‌బుక్స్ అందించేందుకు కసరత్తు చేస్తుండడంతో వారికి ఊరట లభించనుంది. ప్రభుత్వ స్కూల్స్‌లో 24 లక్షల మంది విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ అందజేయనున్నట్టు పాఠశాల విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి తెలియజేసిన విషయం విదితమే.

అడ్డగోలుగా ఫీజు దోపీడీ

రాష్ట్రంలో మొత్తం ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు 30,049, ప్రయివేటు స్కూళ్లు 10549 ఉన్నాయి. వీటిల్లో 58.10 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రతి సంవత్సరం ఫీజులతోపాటు బుక్స్ ధరలు పెరుగుతుండడం విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థికబారమవుతోంది. పాఠశాలలు గతేడాది కంటే ఈసారి 20 శాతం నుంచి 30 శాతం వరకు ఫీజులు పెంచుతున్నాయని తెలుస్తోంది. నగరానికి చెందిన రమణ అనే వ్యక్తి.. తమ బాబుకి ఓ మిషనరీ స్కూల్‌లో ఒకటో తరగతిలో అడ్మిషన్ తీసుకోగా.. అతనికి ఏడాది ఫీజు రూ.47 వేలు, డోనేషన్‌కి రూ.ఐదు వేలు, స్కూల్ యూనిఫామ్స్‌కి రూ.మూడు వేలు, బుక్స్‌కి రూ.4600, రెండు జతల షూస్‌కు రూ.1500, బ్యాగ్‌కు రూ.1000, ట్రాన్స్‌పోర్టు కోసం నెలకు రూ.రెండు వేల వరకు ఖర్చు అవుతున్నట్టు చెప్పారు.

ఐసిఎస్ఇ, సిబిఎస్ఇ వంటి వాటిల్లో సైతం ఫీజుల మోత మోగుతోంది. ఆయా యాజమాన్యాలు నిర్ణయించిన ఫీజులే ఫైనల్‌గా చెబుతున్నారు. లేదంటే మరో స్కూల్లో అడ్మిషన్ తీసుకోవాలని సూచిస్తున్నట్టు పలువురు తల్లిదండ్రులు వాపోతున్నారు. స్కూల్ ఫీజుల నియంత్రణకు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా అవి గడపదాటడం లేదు. కమిటీలు వేస్తున్నా అవి ఇచ్చిన నివేదికలను ప్రభుత్వం చర్చించి ఆమోదించే పరిస్థితి కనిపించడం లేదు. ప్రయివేటు, కార్పొరేట్ స్కూల్స్ ఇష్టారాజ్యంగా మారింది. విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ పెంచి ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్ల ఆగడాలకు చెక్‌పెట్టాలని తల్లిదండ్రులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

నోట్‌బుక్స్ ప్రియం

వచ్చే నెల 12 నుంచి పాఠశాలలు పున:ప్రారంభం కానున్నాయి. నోట్ బుక్స్‌తో పాటు ఇతర స్టేషనరీ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని షాపు నిర్వాహకులు చెబుతున్నారు. దీంతో చాలామంది ముందుగానే నగరంలోని కోఠి, దిల్‌సుఖ్‌నగర్, సికింద్రాబాద్, పారిశ్రామిక వాడల్లో బుక్ స్టోర్స్‌తోపాటు చోటా, మోటా స్టేషనరీ షాపులకు పరుగులు తీస్తున్నారు. పాఠశాలలు ప్రారంభానికి ముందు కొంటే తక్కువ ధరలకు వస్తాయనుకుంటున్న వ్యాపారులు ఇష్టానుసారంగా ధరలు పెంచి అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇదేందని అడిగితే కరోనాకు ముందు పేపర్ రేట్ రూ.70 నుంచి వందలోపే ఉండేదని, ఇప్పుడది రూ.200 ఎగబాకిందని చెబుతున్నారు. ఫలితంగానే 20 శాతం మేర ధరలు పెరిగాయని వివరిస్తున్నారు. దీంతో లాంగ్ నోట్‌బుక్స్ ధరలు గతేడాది కిలో రూ.100-110, కరోనాకు ముందు రూ.80 వరకు ఉండేది. పేపర్ రేట్ పెరగడంతో ఈసారి ప్రస్తుతం కేజీకి రూ.140కి పెరిగిందని, మరో నాలుగైదు రోజుల్లో మరో రూ. 20 పెరగనుందని వ్యాపారులు చెబుతున్నారు.

కేజీకి 300 పేజీల బుక్స్ తూకం వేస్తే రెండు మాత్రమే వస్తుండగా.. 200 పేజీలవి మూడు, వంద పేజీలవి నాలుగు వరకు వస్తున్నాయి. ఈ లెక్కన పదోతరగతి విద్యార్థికి దాదాపు 20 నోట్ పుస్తకాల అవసరం ఉంటుందని ఓ స్కూల్ హెచ్‌ఎం తెలిపారు. వీటి కొనుగోలు కోసం ఒక్కో విద్యార్థి కనీసం గతం కంటే నాలుగైదు వేల రూపాయాలు అదనంగా ఖర్చు చేయాల్సిందే. ఇక స్మాల్ సైజ్ పుస్తకాల ధరలు చూస్తే.. 160 పేజస్ నోట్‌బుక్ రూ.50 ఉండగా.. గతేడాది రూ.45 ఉన్నది. 152 పేజస్ నోట్‌బుక్ రూ.45 ఉంటే అప్పుడు రూ.40 వరకు ఉంది. ఇలా అన్ని రకాల నోట్ బుక్స్ ధరల్లో కంపెనీలను బట్టి రూ.5-10 వరకు పెరిగింది. ఓ మోస్తారు స్కూల్ బ్యాగ్ ధర రూ.500-800కుపైమాటే. ఇలా అన్నింటిల్లో విపరీతంగా ధరలు పెరిగాయి. పాఠ్యపుస్తకాల ధరలు కూడా భారీగా పెరిగాయి. గతేడాది పదో తరగతి సెట్ మొత్తం రూ.1100 ఉండగా.. ఈసారి రూ.1530 అవుతోంది. ఆరో తరగతి పాఠ్యపుస్తకాల సెట్ ధర లాస్ట్ ఇయర్ రూ.693 ఉండగా.. ఈసారి 800పైనే ఉంది. మొత్తంగా నోట్ బుక్స్, పాఠ్యపుస్తక ధరలు 20శాతం పెరగ్గా.. ప్రయివేట్, కార్పొరేట్ స్కూళ్ల అదనపు దోపీడీ మరోలా ఉంది.

ప్రభుత్వ విద్యార్థులకు ఊరట

సాధారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వమే అన్నీ ఉచితంగా అందిస్తోంది. ఈసారి నోట్‌బుక్స్ కూడా ఇవ్వాలని నిర్ణయించింది. ప్రతియేటా స్కూళ్ల ప్రారంభంలో ప్రయివేటు విద్యార్థుల మాదిరిగానే ప్రభుత్వ విద్యార్థులకు కూడా నోట్‌బుక్స్ కోసం సుమారు రూ.2-3వేలకు పైనే ఖర్చు అయ్యేది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు చేయూతనిచ్చే పనులు చేపడుతోంది. నోట్ బుక్స్ ఉచితంగా అందించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులకు రూ.1000 నుంచి 1500 వరకు ఆదా చేయనుంది.

ఏడాదిలో 400 కొత్త సిఎన్‌జి స్టేషన్లు

- మేడ్చల్ జిల్లాలో 100వ స్టేషన్ ప్రారంభం
- మేఘా గ్యాస్ వెల్లడి

హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎంఇఐఎల్ అనుబంధ సంస్థ మేఘా గ్యాస్ 400 సిఎన్‌జి స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. అదే విధంగా రెండు లక్షల పిఎన్‌జి కనెక్షన్లు అందించాలని నిర్దేశించుకున్నట్లు వెల్లడించింది. బుధవారం మేడ్చల్ జిల్లా కీసర వద్ద 100వ సిఎన్‌జి స్టేషన్‌ను మేఘా గ్యాస్ సిఇఒ పలిమిపాటి వెంకటేశ్ ప్రారంభించారు. తొలి సిఎన్‌జి స్టేషన్‌ను ఏపిలోని కృష్ణా జిల్లా ఆగిరిపల్లిలో ప్రారంభించి ప్రస్థానం మొదలు పెట్టామని వెంకటేశ్ పేర్కొన్నారు. ఇప్పటి వరకు తెలంగాణలో 46, ఆంధ్రప్రదేశ్‌లో 28, కర్ణాటకలో 12, ఉత్తర ప్రదేశ్‌లో 4, మధ్య ప్రదేశ్‌లో 4, తమిళనాడులో 3, పంజాబ్‌లో 3 చొప్పున సిఎన్‌జి స్టేషన్లను ఏర్పాటు చేశామన్నారు.

జిఎన్ఐటిఎస్ విద్యార్థులకు నగదు బహుమతి

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రముఖ విద్యా సంస్థ జి నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నలాజీ అండ్ సైన్సెస్ (జిఎన్ఐటిఎస్) విద్యార్థులకు నగదు బహుమతి అవార్డులు దక్కాయి. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (టిఎస్‌పిసిబి) భాగస్వామ్యంతో ఎన్విరైన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రయినింగ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఇపిటిఆర్ఐ) సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈకో ఛాంపియన్ హాకథాన్‌లో జిఎన్ఐటిఎస్‌కు చెందిన విద్యార్థులు రెండవ, మూడవ బహుమతులు పొందారు. వీటిని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోలా ఇంద్రకరన్ రెడ్డి వారికి అందజేశారు. బి నందిని, బి సాయి అన్విత రెడ్డి ద్వితీయ బహుమతి, సర్టిఫికెట్‌తో పాటు రూ.35,000 నగదును పొందారు. రూ.20,000 విలువ చేసే మూడో బహుమతిని భావగ్న నాగిసెట్టి, నిషితా మకమ్, గాయత్రి మంచికంటి బృందం దక్కించుకుంది.

పురోగతిలో ఉన్న పనులను వేగంగా పూర్తి చేయాలి

- మంత్రి హరీశ్ రావు ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర వైద్య మౌలిక సదుపాయాల సంస్థ (టిఎస్ఎంఐడిసి) పరిధిలో పురోగతిలో ఉన్న పనులను వేగంగా పూర్తి చేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. బుధవారం టిఎస్ఎంఐడిసి, ఎన్ హెచ్‌ఎం కార్యక్రమాలపై మంత్రి నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో ఆర్గాన్ ట్రాన్స్ ప్లాంట్ సెంటర్‌తో పాటు గాంధీ, ఎంజిఎం, పేట్లబుర్జు ఆస్పత్రుల్లో ఏర్పాటు చేస్తున్న సంతాన సాఫల్య కేంద్రాలను త్వరగా పూర్తి చేయాలని కోరారు. సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్, నర్సింగ్ కాలేజీలు నిర్మాణాలను లక్ష్యంలోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రారంభానికి సిద్ధంగా ఉన్న బస్తీ దవాఖానలు, తెలంగాణ డయాగ్నొస్టిక్ హబ్స్ ప్రారంభించాలని ఆదేశించారు.ఈ సంవత్సరం ప్రారంభం కానున్న మెడికల్ కాలేజీల పనులు సకాలంలో పూర్తి చేయాలని చెప్పారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 14న ప్రారంభించనున్న కెసిఆర్ న్యూట్రిషన్ కిట్ కార్యక్రమానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి చెప్పారు. ఈ సమావేశంలో వైద్యారోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ, టిఎస్ఎంఐడిసి ఎండి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ మెడికల్ కాలేజీకి అనుమతి : మంత్రి

వంద ఎంబిబిఎస్ సీట్లతో కరీంనగర్ ప్రభుత్వం మెడికల్ కాలేజీకి అనుమతి లభించినట్టు వైద్యారోగ్యశాఖ మంత్రి టి హరీశ్ రావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ట్వీట్ చేశారు. జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలన్న సిఎం కెసిఆర్ సంకల్పానికి ఇదే నిదర్శనమని తెలిపారు. ఈ ఏడాదిలో అనుమతి పొందిన తొమ్మిది మెడికల్ కాలేజీలకు అభినందనలు తెలిపారు. వీటితో అదనంగా 900 ఎంబీబీఎస్ సీట్లు వచ్చాయని పేర్కొన్నారు. వైద్యవిద్యలో మరో మైలురాయికి చేరుకున్నామని హర్షం వ్యక్తం చేశారు. సిఎం కెసిఆర్ నాయకత్వంలో తొమ్మిదేళ్లలో తెలంగాణలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల సంఖ్య ఐదు నుంచి 26కు చేరుకున్నాయని తెలిపారు. వైద్యవిద్యతో పాటు ఆరోగ్యసంరక్షణ సేవలకు ఇవి ఊతమిచ్చాయని మంత్రి తెలిపారు. కొత్తగా కరీంనగర్‌కు ప్రభుత్వ మెడికల్ కాలేజీ రావడం ప్రత్యేక వైద్యసేవలను ప్రజలకు చేరువ చేస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మనమెక్కడున్నాం...?

- టిడిపి జాతీయ అధికార ప్రతినిధి తిరునగరి జ్యోత్స్న

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తొమ్మిది సంవత్సరాల తెలంగాణ రాష్ట్రం ప్రస్థానంలో మనం ఎక్కడ ఉన్నామో ఆలోచించుకోవాల్సిన అవసరముందని తెలుగుదేశం జాతీయ అధికార ప్రతినిధి తిరునగరి జ్యోత్స్న ప్రశ్నించారు. స్వరాష్ట్రాన్ని సిద్ధించుకుంటే బతుకులు బాగుపడతాయని కార్మికులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు భావించారని చెప్పారు. అందుకే ప్రతి ఒక్కరూ పోరాడి తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామని తెలిపారు. జూన్ రెండు నుంచి 22వ తేదీ వరకు రోజూ ఒక ప్రభుత్వ శాఖ గత తొమ్మిదేళ్లలో సాధించిన ప్రగతిని ప్రజల ముందు ఉంచుతుందన్నారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ ఇచ్చిన హామీలు ఎంత వరకు అమలు జరిగాయో పరిశీలించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆర్‌టిసి కార్మికులు స్వరాష్ట్రం కోసం విరోచితంగా పోరాడి సకల జనుల సమ్మెను విజయవంతం చేయడంలో దోహదపడ్డారని అన్నారు. తమ డిమాండ్ల సాధన కోసం 2019లో స్వరాష్ట్రంలోనే సమ్మెబాట పట్టారని గుర్తు చేశారు. అప్పట్లో ఆర్‌టిసికి ప్రతియేటా రూ. వెయ్యి కోట్లు ఆర్‌టిసికి విడుదల చేస్తామన్న కెసిఆర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. ఈ నిధులలో 50 శాతం కూడా ఇవ్వలేదని విమర్శించారు. పది వేల మందిని ఆర్‌టిసిలో నియమిస్తామని చెప్పి తొమ్మిది సంవత్సరాలలో ఒక్క నియామకమూ జరపలేదన్నారు. మహిళా ఉద్యోగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని ఇచ్చిన హామీ అమలు చేయకపోగా వారిపై వేధింపులు పెరిగాయని గుర్తు చేశారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు.

సాయికుమార్ అరెస్టుకు పిడిఎస్‌యు ఖండన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యార్థి నాయకులు పోకల సాయికుమార్ అక్రమ అరెస్టును పిడిఎస్‌యు పూర్వ విద్యార్థుల రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఆయన్ను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఆర్ గురువారెడ్డి, కో-కన్వీనర్లు కొండా నాగేశ్వర్, ఎ.వినయ్‌బాబు, ఈ రఘునందన్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సాయికుమార్ మీద బైండోవర్ కేసు నమోదు చేసి పోలీసులు ఇబ్బందులకు గురిచేశారని తెలిపారు. ఈ విషయంలో హోంమంత్రి, డిజిపి జోక్యం చేసుకుని సాయికుమార్‌ను విడుదల చేయాలని కోరారు.

ప్రజాసంఘాల ఉమ్మడి వేదిక ఖండన

సాయికుమార్‌ను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని ప్రజా సంఘాల ఉమ్మడి వేదిక ప్రతినిధులు విమలక్క, మోహన్ బైరాగీ, మల్సూర, మల్లేశం, బాపురావ్, విజయ్, నాగిరెడ్డి, అనసూయ, సంతోష్ బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థిగా పాల్గొన్నారని, ప్రగతిశీల ఉద్యమంలో కొనసాగాడని తెలిపారు. ఆయన్ను పోలీసులు అరెస్టు చేయడాన్ని ప్రజాస్వామికవాదులు, మేధావులందరూ ఖండించాలని కోరారు.

నాపై కేసు కొట్టివేయండి

- హైకోర్టులో నటి డింపుల్ క్వాష్ పిటిషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో నటి డింపుల్ హయాతి బుధవారం పిటిషన్ దాఖలు చేశారు. ట్రాఫిక్ డిసిపి ఒత్తిడితో తనపై తప్పుడు కేసు పెట్టారని పిటిషన్‌లో ఆమె పేర్కొన్నారు. డింపుల్ హయాతికి సీఆర్‌పీసీ 41ఏ కింద నోటీసు ఇచ్చినట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు తెలిపారు. వాదనలు విన్న న్యాయస్థానం.. సీఆర్‌పీసీ 41ఏ నిబంధనల మేరకే వ్యవహరించాలని పోలీసులను ఆదేశించింది. కాగా.. ఐపీఎస్ అధికారి, ట్రాఫిక్ డిసిపి రాహుల్ హెగ్డే కారుపై దాడి చేశారన్న కారణంతో ఆయన డ్రైవర్ చేతన్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు డింపుల్ హయాతి, డేవిడ్ అనే వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

వేతనాల సలహామండలిలో కేంద్ర కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం

- సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర కనీస వేతన సలహా మండలిలో కేంద్ర కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని సిఐటియు రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో కార్మిక శాఖ ముఖ్యకార్యదర్శి ఐ రాణికుముదినికి సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేశ్, రాష్ట్ర కమిటీ సభ్యులు జె కుమారస్వామి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ..రాష్ట్ర కనీస వేతన సలహా మండలిని ఏర్పాటు చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. అందులో కొన్ని కేంద్ర కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించకపోవడం గత సాంప్రదాయాలకు భిన్నమైందని తెలిపారు. కార్మిక సంఘాలకు విస్తృతంగా ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా కార్మికుల సమస్యలపై సమగ్ర చర్చ జరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు.

రాష్ట్రంలో కనీస వేతనాలు వర్తించే 73 షెడ్యూల్ ఎంప్లాయ్‌మెంట్స్ కాలపరిమితి ముగిసి చాలా ఏండ్లు గడుస్తున్నదన్నారు. సత్వరమే కొత్త జిఒలను విడుదల చేయాలని, కనీస వేతనాల సలహామండలిలోకి కేంద్ర కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు.

అత్త, మామపై దాడిచేసిన అల్లుడు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బోడుప్పల్ అన్నపూర్ణ కాలనీలో బుధవారం దారుణం జరిగింది. వృద్ధదంపతులైన అత్త మామలపై అల్లుడు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్నపూర్ణ కాలనీ వీధి నెంబరు 6లో నివాసముంటున్న సూర్య, రుక్మిణి దంపతులు వారి నివాసంలో ఉండగా.. అల్లుడు అనిల్ కుమార్ కత్తితో దాడి చేశాడు. అత్త గొంతుకోసి, మామ తల పగులగొట్టి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన వారి పరిస్థితి విషమంగా ఉండటంతో కాలనీ వాసులు 108కి సమాచారం ఇచ్చి గాంధీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం దంపతుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

మిషన్ కాకతీయతో 47 వేల చెరువుల పునరుద్ధరణ

- 15 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ
- 3,825 కోట్లతో 1200 చెక్ డ్యామ్‌ల నిర్మాణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన వెనువెంటనే చేపట్టిన బృహత్తరమైన పథకం మిషన్ కాకతీయ. తెలంగాణ భూభౌతిక పరిస్థితికి అనుగుణంగా కాకతీయ రాజులు నిర్మించిన గొలుసుకట్టు చెరువుల సాగునీటి వ్యవస్థ తెలంగాణకు ప్రాణప్రదమైంది. సమైక్యపాలనలో చెరువుల వ్యవస్థ చిన్నాభిన్నమైపోయింది. గంగాళాల వంటి చెరువులు పూడిక నిండి తాంబాళాల్లా నవజీవం తెచ్చే పథకానికి కాకతీయుల స్మరణలో మిషన్ కాకతీయగా ప్రభుత్వం నామకరణం చేసింది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో 47 వేలకు పైగా చెరువులను పునరుద్ధరించి, చెరువు కట్టలను పటిష్టపరిచి, కాలువలకు, తూములకు మరమ్మతులు చేసి, పూడిక తొలగించిన ఫలితంగా నేడు రాష్ట్రంలోని చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం గణనీయంగా పెరిగిపోయింది. 5,350 కోట్ల రూపాయలు వెచ్చించి చెరువులను పునరుద్ధరించడంతోపాటు, విరివిగా చెక్ డ్యాముల నిర్మాణం చేపట్టి వాగులను పునరుజ్జీవింప చేయటంతో లక్షలాది ఎకరాల ఆయకట్టు స్థిరీకరించబడింది. దాదాపు 15 లక్షల ఆయకట్టు స్థిరీకరణ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం 3,825 కోట్లతో 1200 చెక్ డ్యామ్‌ల నిర్మాణం చేపట్టింది. వీటిలో మొదటి దశ 650 చెక్ డ్యామ్‌ల నిర్మాణం పూర్తయింది. మిగతా చెక్‌డ్యామ్‌ల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయి. మిషన్ కాకతీయ ద్వారా పునరుద్దరించబడిన చెరువులకు భారీ, మధ్య తరహా ప్రాజెక్టుల నుండి కాలువల ద్వారా నీటిని తరలించి ఎండాకాలంలో సైతం పూర్తి స్థాయి నీటి నిల్వతో చెరువులు నిండుగోలాలుగా తయారయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నేడు దేశంలో చాలాచోట్ల భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. కానీ, తెలంగాణ రాష్ట్రంలో మాత్రం ఉబికిఉబికిపైకి వస్తున్నాయి. చెరువుల కింద ఆయకట్టుకు సాగునీరు సమద్ధిగా లభిస్తుండటంతో ఆకుపచ్చ తివాచీ పరిచినట్టు కనిపిస్తూ పంట పొలాలు కనువిందు చేస్తున్నాయి.ఈ మేరకు రాష్ట్ర పౌరసంబంధాల స్పెషల్ కమిషనర్ ఒక ప్రకటన విడుదల చేశారు.

మాసబ్‌చెరువులో నిర్మాణాలు వద్దు : హైకోర్టు ఆదేశం

- బఫర్ జోన్‌లో భూమిని ఎలా కొనుగోలు చేస్తారని ప్రశ్నించిన న్యాయస్థానం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తుర్కయాంజాల్‌లోని మాసబ్ చెరువులో ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని హైకోర్టు ఆదేశించింది. నీటివనరులు ప్రజలకు ఎంతో అవసరమని, అటువంటి ప్రదేశాల్లో నిర్మాణాలను అనుమతించరాదని స్పష్టంచేసింది. మాసబ్‌చెరువులో అక్రమ నిర్మాణాలను అధికారులు తొలగించకపోవడాన్ని సవాల్ చేస్తూ సిపిఎం నాయకులు డి కిషన్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తాకారాంజీలతో కూడిన ధర్మాసనం ఈ పిల్‌ను విచారించింది. చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్‌లో భూములను ఏ విధంగా కొనుగోలు చేస్తారని నిర్మాణ సంస్థ బూరుగు ఇన్ ఫ్రాను న్యాయస్థానం ప్రశ్నించింది. పిటిషనర్ తరుపున సీనియర్ న్యాయవాది ఆర్.ప్రశాంత్ వాదనలు వినిపిస్తూ... చెరువు ఎఫ్‌టిఎల్ ప్రాంతంలో ఇసుక,మట్టితో చదును చేస్తున్నారని, అక్రమంగా నిర్మాణాలు కూడా చేపట్టారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వర్షపు నీరు చెరువులోకి రాకుండా నాలాలకు అడ్డుకట్ట వేస్తున్నారని తెలిపారు. ఈసమయంలో బూరుగు ఇన్ ఫ్రా న్యాయవాది జోక్యం చేసుకుని..తాము పట్టా భూమిని కొనుగోలు చేసి అందులోనే నిర్మాణాలు చేపడుతున్నామని వాదనలు వినిపించారు. 2016లోనే మాసబ్‌చెరువు బఫర్ జోన్‌ను ఖరారు చేశారని, ఇప్పటికే తాము కొనుగోలుచేసిన 2.5ఎకరాలు నష్టపోయామని కోర్టుకు వివరించారు. బఫర్‌జోన్ నిర్ధారణ అయినందున నిర్మాణాలకు అనుమతించాలని కోరారు. దీనికి సిజె స్పందిస్తూ, బఫర్ జోన్‌లో భూములను ఎలా కొనుగోలు చేస్తారని ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేసినప్పుడు ఇలాంటివి తప్పవని అన్నారు. చెరువులో అక్రమనిర్మాణాలపై పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని న్యాయస్థానం రెవెన్యూ అధికారులను ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు ఎనిమిదికి వాయిదా వేసింది.

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జె వెంకటేష్, ప్రధాన కార్యదర్శి జె కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు జె కుమారస్వామి తదితరులు కలిసి మెమోరాండం అందజేశారు. రాష్ట్రంలో 40 శాఖల్లో 1,40,000 వేల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని, వారికి ఎక్కడా కనీస వేతనం దక్కకపోగా ఐదారు నెలలకోసారి వేతనాలు ఇస్తున్నారని సిఎం దృష్టికి తీసుకెళ్లారు. అతి తక్కువ వేతనాలతో పని చేస్తుండటంతో వారి కుటుంబాలు కూడా గడవడం కష్టమవుతున్న తీరును వివరించారు. జూలై నుంచి ప్రభుత్వోద్యోగులతో పాటు వారికి కొత్త వేతనాలు అమలు చేయాలని కోరారు. యూనివర్సిటీలు, వైద్య ఆరోగ్య, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచాయితీ కేంద్ర - రాష్ట్ర పథకాల్లోని సిబ్బందితో సహా వివిధ డిపార్ట్‌మెంట్లలో ఏజెన్సీలు రిక్రూట్ చేసిన ఉద్యోగులతో సహా అందర్నీ పిఆర్‌సి జిఒ పరిధిలోకి తేవాలని విజ్ఞప్తి చేశారు. పాలిటెక్నిక్ విభాగంలో సుమారు 200 మందిని రెన్యువల్ చేయలేదనీ, వారి సమస్యను పరిష్కరించాలని కోరారు. టెర్మినేట్ చేసిన 23 మందిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వారికి డిఎ, హెచ్‌ఆర్ఎ ఇవ్వడంతో పాటు ప్రతి నెలా మొదటి వారంలోనే వేతనాలు ఇవ్వాలని కోరారు. పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

వేతనం కోసం వెతలు

- పని భారంతో ఈ-పంచాయతీ ఆపరేటర్లు
- భద్రత లేని ఉద్యోగం.. అరకొర వేతనంతో సతమతం
- ప్రభుత్వ ఖజానా నుంచే చెల్లించాలని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పంచాయతీరాజ్ వ్యవస్థ శక్తివంతంగా ఏర్పడటంలో.. ప్రజలకు పారదర్శకంగా జవాబుదారీతనం పెంచడంలో.. సాంకేతిక సమాచార వ్యవస్థతో సత్వర సేవలను ప్రజలకు అందించడంలో ఈ పంచాయత్ ఆపరేటర్ల పాత్ర ముఖ్యమైంది. కానీ వారు ఏళ్ల తరబడి పనిభారంతో సతమతమవుతూ చాలీచాలనీ వేతనాలతో వెతలు పడుతున్నారు. ఆపరేటర్ల ఉద్యోగానికి భద్రత లేకుండా పోయింది.. తొమ్మిదేళ్ల క్రితం కార్వీ అనే ఏజన్సీ ద్వారా రాష్ట్రంలోని 2240 క్లస్టర్ గ్రామ పంచాయతీలకు 1140 మంది ఈ- పంచాయతీ డేటా ఎంట్రీ ఆపరేటర్లు నియమితులయ్యారు. ఒప్పందం గడువు ముగిసినా తదుపరి వీరి సేవలు అనివార్యం కాగా పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు కొనసాగించడానికి ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కొక్కరికి ఎనిమిది నుంచి పది గ్రామ పంచాయతీలకుపైగా రాష్ట్రంలోని 12,753 గ్రామ పంచాయతీల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను అమలు చేయడంలో పనిచేస్తున్నారు. వేతన చెల్లింపుల్లో మాత్రం జిల్లాకో తీరు అమలవుతోంది. కేవలం 11 జిల్లాల్లో మాత్రమే జిఒ 60 ప్రకారం రూ.22,750 అమలవుతోంది. మిగతా 20 జిల్లాల్లో జిల్లాకో తీరుగా తక్కువ వేతనం ఇస్తున్నారు. పని భారం విపరీతంగా పెరిగి తీవ్రంగా ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆపరేటర్లు వాపోతున్నారు. జీపీల్లో నిధులు కొరవడ్డాయి.. 15 ఫైనాన్స్ కార్పొరేషన్, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ల నుంచి నిధులు ఎప్పుడు విడుదలవుతాయో తెలియని పరిస్థితి ఉంది. వేతనం కోసం నెలల తరబడి ఎదురు చూడాల్సి వస్తుందని.. ఈ తరుణంలో పెరిగిన ధరలతో చాలీచాలనీ వేతనంతో కుటుంబ పోషణ కష్టతరంగా మారిందని ఆపరేటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఖజానా నుంచే నేరుగా వేతనాలకు బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు.

పనిభారం ఇలా. సమయపాలన లేని ఉద్యోగం..

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల పథకాలు, 30 రోజుల ప్రణాళిక (1,2), పల్లె ప్రగతి, హరితహారం, జనన-మరణ ధృవీకరణలు, భవన నిర్మాణం - ఆస్థి మార్పిడి, వ్యాపార లైసెన్సులు, ప్లాన్‌ప్లస్, ఈ గ్రామ్ స్వరాజ్, ఆస్తుల జియో ట్యాగ్, లోకల్ గవర్నమెంట్ డైరెక్టరీ, పంచాయతీ కార్యదర్శుల ప్రతి నెల యాక్టివిటీ, పిఎఫ్ఎంఎస్, జీపీల అభివృద్ధి పనులకు సంబంధించి 11 రకాల అప్లికేషన్లు, ఆదాయవ్యయాలను ఎప్పటికప్పుడు కంప్యూటీకరణ చేయాల్సి ఉంటుంది. ఇలా విధులు నిర్వహిస్తూనే ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు పింఛన్‌ల నమోదు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ కార్పొరేషన్‌లు, దీపం పథకం, ఐఐహెచ్‌ఎల్ (స్వచ్ఛ భారత్) ఆన్‌లైన్ పనులను తూచా తప్పకుండా ఎప్పటికప్పుడు డేటా ఎంట్రీ చేయాలి. 2019 సాధారణ ఎన్నికల్లో సర్పంచ్, ఎంపిటిసి ఎన్నికల విధులు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శుల విధులు, చేపడుతున్న పనులకు సంబంధించి ప్రభుత్వ వెబ్‌సైట్‌లో నమోదు చేస్తూ పంచాయతీ రాజ్ వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇంతటి పనిభారం తమపై మోపుతూ చాలీచాలనీ వేతనాలను ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ఆపరేటర్లు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఒకే కేటగిరీలో పనిచేస్తున్న ఆపరేటర్లందరికీ జిఒ ఎంఎస్ నెంబర్ 60 ప్రకారం మూడు కనీస వేతనం రూ.22,750 వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించడానికి నేరుగా ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలని, ప్రసూతి సెలవులు, పిఎఫ్, ఇహెచ్‌ఎస్ వర్తింపజేయాలని కోరుతున్నారు.

జిఒ 60 ప్రకారం కనీసం వేతనం చెల్లించాలి : గడ్డం శేషాద్రి, ఈ-పంచాయతీ ఆపరేటర్ల అధ్యక్షులు

తొమ్మిదేళ్లగా ఈ-పంచాయతీలో డేటా ఆపరేటర్లుగా పనిచేస్తున్నాం. కనీస వేతనం అందక సతమవుతున్నాం. రాష్ట్ర ప్రభుత్వం జిఒ 60 ద్వారా కనీస వేతనం ఇవ్వాలని ఉత్తర్వులు జారీచేసింది. పంచాయతీరాజ్ శాఖలో మాత్రం పూర్తి స్థాయిలో అమలు చేయడం లేదు. కేవలం 11 జిల్లాల్లో మాత్రమే అమలు చేస్తున్నారు. మిగతా జిల్లాల్లో తక్కువ వేతనం ఇస్తున్నారు. పూర్తి స్థాయి ఉద్యోగులుగా పనిచేస్తూ పనిభారంతో సతమతమవుతున్నాం. ఉద్యోగ భద్రత కల్పించాలి. బీమా, పిఎఫ్, హెల్త్ కార్డులు వంటి సౌకర్యాలు కల్పించాలి.